# కొకితో కబురు



ఆ వేపచెట్టు కింద తలెత్తకుండా అంట్లు తోముతోందే - ఆ పిల్లపేరు జువ్వి. 'మడిసల్లే ఎందుకు బతుకుతావే! మానల్లే పడుండు సుకపడతావు' అని ఆ తల్లి కూతురికి జువ్వి అని పేరెట్టిందేమో తెలియదు. కానీ జువ్వి మనిషిలా బతకాలని, నవ్వాలని, ఏడవాలని కలలు గంటోంది. జువ్వి దొడ్లోకి రావటం

ఆలస్యం చెట్టుమీది కాకులన్నీ వచ్చి చేరతాయి. ఉడతలు కొమ్మతొర్రల్లోంచి పరుగెత్తుకొస్తాయి. రామచిలకలు చిటారు కొమ్మనించి కింద కొమ్మలమీదికి రివ్వున వచ్చి వాలతాయి. జువ్వి అంట్లు ఒక్కొక్కటే తెచ్చి పడేసుకుంటుంటే కాకులు గెంతుతూ ఇంకా దగ్గర కొస్తాయి. "ఉండండే! ఒకటే తొందర!" అని విసుక్కుంటుంది జువ్వి. కాకులు ముక్కులు రాసుకుంటూ రెక్కలు తప తప కొట్టుకుంటూ ఇంకా దగ్గరకొస్తాయి. గిన్నెల్లో అడుగు మెతుకులు తీసి రాయిమీద పెడ్తే వాట్ని కలేబడ్తూ తన్నుకుంటూ తింటుంటాం. కాకులు. "కొట్టుకు చావమోకండే కాస్త దానికి" అని మందలిస్తుంది జువ్వి. ఓ కూరముక్క తొర్రలోంచి తొంగి చూస్తున్న ఉడతకోసం విసుర్తుంది. కొమ్మ మీదున్న రామచిలకని చూసి "నువ్వు రాణివాసం పిట్టవాయె! నువ్వు ఎంగిలి మెతుకుల కొస్తావా! ఇదో!" అని వస్తూ వస్తూ ఏరుకొచ్చిన చింత కాయలు ఎగరేస్తుంది. ఒక చింతకాయ రామచిలక ముక్కున పట్టుకుంటే కిందపడ్డ ఇంకో చింతకాయ కోసం ఉడత పరుగెత్తుతుంది.

ఏదో తినటం అయిపోయిందిగదా అని వెళ్లిపోవు పక్షులు. జువ్వి అంట్లు తోముతుంటే చుట్టూ సభ చేసినట్టు చేరతాయి. ఓ కాకి రాయిమీద, ఇంకోటి గుట్టమీద, మరోటి బోర్లించిన గిన్నెమీద ఇలా చుట్టూ చేరి జువ్వి చెప్పే కబుర్లు ఆలకిస్తూ ఉంటాయి. అంట్లు తోముకుంటూ జువ్వి తన వూసంతా వీటికి వెళ్ళబోసుకుంటుంది.

"చింతాలు మావ ఏ రేవు నున్నాడో సూసిరాకూడదంటే! ఆడి పడవ అమరావతొడ్డు తాకి నెల్రోజు లయింది. నా మెళ్ళో తాళికడ్తే నేను సక్కంగ వంట చేసి పెడ్డునా? ఆడు పడవల్లో సేరి ఆళ్ళకీ ఈళ్ళకీ వండి పెట్టే కర్మ ఏంది? అవున్లే ఆడిదేం తప్పు? మా అయ్యదే తప్పు. "సంపాదన లేనోడికి పిల్లనిస్తానా" అన్నాడు. పడవల్లో వంటపుట్టి కింద చేరిపోయిండు. అమ్మ పోయినకాణ్ణించి అయ్యనిడిసిపెట్టలేక నేనున్నాను. నేం తెచ్చే అన్నం మెతుకుల కోసం నన్నిడిసిపెట్టనంటడు అయ్య. పోన్లే నా అన్నం తింటే తిన్నాడు. ఆణ్ణీ,

ఈణ్ణీ డబ్బులడుక్కుని ఆ తాగుడెందుకంట! ఏం జేస్తాం చెప్పు. తాగినా తన్నినా అయ్య అయ్యే కద. నేను మా మావెంట ఎల్లిపోతే ఆడికి దిక్కెవరు?

ఏవే! మావ పడవ దొండపాడు రేవుకాడుందన్నారే ఎట్టుండాడో చూసి రాకూడదంటే, ఆడు లాంచీల్లో చేర్తాడని ఎవరో సెప్పారు. ఒద్దని సెప్పవే! లాంచీల్లో చేర్తే కిట్ట ఇడిసిపెట్టి గోదార్లో కెల్తాడు. అసలే సూపందదు.

రోజా ఇదే పాట ..... జువ్వి మళ్ళీ మళ్ళీ చెప్తూండడం కాకులు అంతా తెలిసిపోయినట్లు, 'ఆలోచిస్తాం!' అన్నట్లు ముక్కులతో రెక్కలు గీరుకుంటూ అంటూండడం, ఇంతలో ఇంటావిడ 'జువ్వీ! ఎవరితోనే మాట్లాడుతున్నావు' అంటే "ఏం లేదమ్మా! ఈ కాకులు ఒకటే రొద! హేయ్' అంటూ కాకుల్ని అదిలించి అంట్లు ఇంట్లో ఇచ్చెయ్యటం మామూలు.

ఆరోజు ఇంటావిడ జువ్వికి ఉప్పుడుపిండి పెట్టి 'తినవే' అంది. జువ్వికి ఏం పెట్టినా సరే ఆ ఆకు చేత్తో పట్టుకుని ఏడుస్తుంది. జువ్వి తల్లికూడా అంట్లు తోమేది. ఇంటివాళ్ళు ఏవన్నా పెడ్తే జువ్వితల్లి మొగుడికి తెలియకుండా ఐదేళ్ళ జువ్వికి తీసుకొచ్చి పెడ్తే కాని తినేది కాదు. 'తినవే' అని తల్లి అంటే 'అయ్యకో?' అని ఏడ్చేది. ఇప్పటికీ అంతే, ఆకుపట్టుకుని జువ్వి ఏడుస్తుంటే "ఏడుపెందుకే పిచ్చిదానా!' అని ఇంటావిడ సముదాయిస్తే జువ్వి కళ్ళు తుడుచుకుని 'ఇంటికెళ్ళి తింటానమ్మా' అంది. 'ఓసి వెర్రి! మీ అయ్యకు నేను వేరే ఇస్తా. నువ్వు తిను' అని ఆవిడంటే అప్పుడు జువ్వి ముఖం విప్పారింది. నవ్వుకుంటూ ఆకు తీసుకు పరుగెత్తింది.

శ్రావణ మాసాన -

కృష్ణ నిండుగా వొడ్లు పొంగి పారుతున్నవేళ. పూజారి వీధి ఇళ్ళు ఆనుకుని కృష్ణ పారుతుంటే, కృష్ణ మధ్యనుంచి వడిలో పడవలు పోలేవు కనుక వొడ్డమ్మటే పడవలు లాక్కెతుళుంటే పడవలన్నీ దొడ్లలోంచి పోతున్నట్లుండేవి.

తెల్లవారగట్టే వచ్చింది జువ్వి పడవల కోసం. జువ్వితోపాటే కాకులూ, ఉడతలూ,

రామచిలుకలూను. అంట్లు తోముతోందేకాని పడవలమీదే ధ్యాస. పరుగెత్తికెళ్ళి ప్రతి పడవ చూస్తోంది. చింతాలు మావ పడవ రాలేదు. కాకులన్నీ కావు కావు మంటూ కృష్ణమీది కెళ్ళాయి. అంటే పడవొస్తోందన్నమాట. జువ్వి అంట్లగిన్నెతో పరుగెత్తుకెళ్ళింది. మాసికల తెరచాప పడవ దగ్గరకొస్తోంది. జువ్వి గుండె దబదబ కొట్టుకుంటోంది. అల్లదుగో! చింతాలు మావ! చుక్కాని దగ్గర వంట గిన్నెతో చెయ్యూపాడు. జువ్వి అంట్లగిన్నె వూపింది. పడవ దగ్గర కొస్తోంది. జువ్వి కళ్ళు పొంగాయి - వొళ్ళు పొంగింది. కళ్ళలో కృష్ణ ముంచుకొచ్చింది. జువ్వి దగ్గర కొచ్చింది పడవ. చింతాలు నవ్వుతూ కళ్ళన్నీ జువ్వి మీదే పెట్టి చూశాడు. జువ్వికి ఏదో అడుగుదామనిపించింది. మాట రాలేదు. చింతాలుకి ఏదో చెప్దామనిపించింది - గొంతు పెగల్లేదు.పడవ జువ్విని దాటిపోతోంది. చింతాలు లంకల్లో కోసుకొచ్చిన జామకాయ వొడ్డుమీదికి విసిరాడు. జువ్వి చెంగున ఎగిరి అందుకుంది. మాసికల తెరచాప దూరమయింది. చింతాలు మావ వెళ్ళిపోయాడు. ఇంటావిడ ఇంట్లోంచి 'జువ్వీ!' అని పిలవడంతో జువ్వి ఈ లోకంలోకి వచ్చింది. గెంతుకుంటూ దొడ్లో కొచ్చి ఎక్కడలేని సంబరంతో ఒకచేత అంట్లు తోముతూ ఇంకోచేత ప్రియంగా జామకాయ కొరుక్కుతింటోంది. తనింత కొరుక్కుని ఇంత ముక్క కాకులకి పెట్టింది. మరింత ముక్క ఉడత కిచ్చింది. మిగిలిన ముక్క రామచిలకల కెగరేసింది.

ఆ తర్వాత ఇంటావిడ చల్లపిండి పెడ్తే ఆకు పట్టుకు ఏడ్చింది జువ్వి. "మీ అయ్యకి నేను వేరే పెడ్తాలేవే" అన్నా జువ్వికి ఏడుపు ఆగలేదు. జువ్వి మళ్ళీ ఏడ్చింది అయ్యకోసం గాదు చింతాలు మావకోసం.

కళ్ళు తుడుచుకొని ఇవతలకొచ్చి చుట్టూ చేరిన కాకులతో, ఉడతలతో, చిలకలతో అంది.

"మా మావ పడవ ధరణికోట రేవు కాడుంటది. మీరెళ్ళి నేను మావకోసం ఏడవలేదని చెప్పండే! నవ్వానని చెప్పండేం!" అంటూ గలగలా నవ్వింది. *